# మధుమాధవులు

శ్రీమతి సి. హేమలతాదేవిగారు

పాపము మాధవరావు తల్లితండ్రులు చిన్ననాటనే చనిపోయిరి. తల్లితండ్రులు చనిపోయినప్పటినుంచి మాధవుడు అతని మేనమామగు రంగారావుగారి యింటివద్దనే పెరుగుతున్నాడు. రంగారావుగారు గొప్ప ఆస్తిగలవాడు. విద్యావంతుడు. విశ్వాసపాత్రుడు. దానధర్మములయందు ఓర్పుగలవాడు. ఆయనకి ఒక్క కన్యారత్నము వున్నది. ఆమెపేరు మధురం. పురుషసంతానములేని కారణముచేత మాధవునికూడా ప్రేమతో చూచుచున్నాడు. రంగారావుగారు అంటే వూరందరకు చాలా యిష్టం. ఆయన భార్య అంటే అసహనం. ఆవిడ పట్టినపట్టే చెల్లాలి గాని బ్రహ్మదేముడు చెప్పినా వినిపించుకోని రకం. రంగారావుగారు మాధవునకు ఏ లోటులేకుండా ప్రతి విషయములోను తన మధురమును పోషించుచున్నట్లుగానే అతనినికూడా పోషించుచున్నాడు. మాధవుడ్ను అంటేకూడా వూళ్ళోవాళ్ళకు ప్రేమాంకురములు బయలుదేరినాయి. మధు మాధవులకు సరియైన జత కుదిరినది. ఇద్దరకూ యౌవనాంకురములు బయలుదేరుతున్నవి. వీరి అందము వీరి జత చూచి వూరంతా సంతసించేవారు. మాధవునకు ఏమియు లేకపోయినప్పటికి మేనల్లుడియందైన గాఢ ప్రేమచేత వీరిద్దరకు తప్పక వివాహము చేయవలెనని రంగారావుగారు సంతోషపడుతుండేవాడు. మధు మాధవుల వివాహము అంటే రంగారావుగారి భార్య అగు శేషమ్మగారికి ఏమాత్రం ఇష్టంలేదు.

మధు మాధవుల వివాహం అంటే ఆమెకు ఎందుకు ఇష్టంలేదంటే మాధవునకు చదువు వున్నప్పటికి ఏమియు ఆస్తిలేదని. మాధవునకు ఏలాగైనను మధురమును చేసుకొందామనే గొప్ప వూహ. మధురముకు మాధవుని తప్ప ఇతరులను పెండ్లాడగూడదని; ఇద్దరు కంకణము కట్టుకున్నారు. రంగారావుగారికికూడా మధు మాధవుల వివాహము అంటే అమిత ఇష్టం. శేషమ్మగారికిమాత్రం అమిత అయిష్టం, ఏమిచేస్తారు ?

ఇట్లా కొంతకాలం జరిగింది. మధు మాధవుల దురదృష్టముచేత రంగారావుగారు హఠాత్తుగా చనిపోయారు. శేషమ్మగారి దుఃఖముకు హద్దులేదు. మధు మాధవులు రంగారావుగారి అకాలమరణమునకు దుఃఖసముద్రములో మునిగిపోయిరి. మధు మాధవులకు కల్పతరువు పోవుటచే వారిని బెంగ ఆవరించింది. మాధవుడు చదువు నిమిత్తం బొంబాయి వెళ్లిపోయినాడు. మధురముకు ఏమున్నది ? తన తండ్రి పరలోకగతుడు అవడమే కాకుండా ఎప్పుడు విడవని తన ప్రేమ బావకూడా దూరము వెళ్లిపోయినాడు. దుఃఖమునకు హద్దులేదు. పాపము మాధవునకు చదువుయందు అభిలాష వున్నప్పటికి మతి అంతయు

మధురమునీ దేవుంది. ఏమిచేస్తాడు ? మాధవుడు బొంబాయిలో వున్నంతకాలం మధురముకు అనుదినము ఉత్తరములు వచ్చుచునేయుండేవి.

ఇంతలో క్రిష్టమస్ శెలవలు యిచ్చినారు. మాధవుడు యింటికివచ్చినాడు. ప్రతి దినము మధుమాధవులిద్దరు కలసిమెలగుచుండేవారు. శేషమ్మగారు మధురమును నిందించని ఘడియలేదు. ఎట్లాగో మధుమాధవులకు 15 దినములు పదిహేనుఘడియలలా గడచిపోయినవి. ఇద్దరు ఆరోజులను దూషించినారు. అయినను ఏమిలాభము. మాధవుడు తిరిగి బొంబాయి ప్రవేశించినాడు. శేషమ్మగారు మధురమును మాధవునకు యిచ్చి వివాహముచేయుటకు ఇష్టములేక మరియొక సంబంధముచూచి వివాహముచేసినారు. పాపము మధురము తన తండ్రిలేని హేతువుచేత తనకు అయిష్ట సంబంధము అయినది కదా అని విచారించుచుండెడిది. ఆమె మనస్సులో విచారాంకురములు నాటుకుపోయినవి. మాధవునకు ఈమె వివాహము సంగతి తెలిసి, బ్రహ్మచారిత్వము ధరించడమా ? మధురముతో ప్రాణములను విడవడమా ? ఈ విచారముతో ఒక్కొక్కదినము ఒక్కొక్క సంవత్సరముక్రింద గడుపుచువచ్చినాడు. ఇంతలో పరీక్షాదినములు వచ్చినవి. పరీక్ష పేపరు వ్రాసినాడు. వేసంగిశలవులు యిచ్చినారు.

మాధవుడు మెయిలులో బయలుదేరి ఇంటికివచ్చినాడు. మధుమాధవులకు వళ్లు తెలియదు. కొంతసేపు గాఢాలింగనముచే మైమరచిరి. ఇద్దరికి తెలివివచ్చి సంచరించు చున్నారు. శేషమ్మగారి శరీరములో క్రోధానలము ప్రవేశించింది. ఏమిచేయగలదు? ప్రేమబంధమును ఎవరు అడ్డువెళ్లగలరు ? రాత్రి 7 ఘంటలు అయినది. శేషమ్మగారు మధుమాధవులు భోజనంచేసిరి. ఎవరిగదులలో వారు ప్రవేశించిరి. మధుమాధవులకు ఏమితోచును ? ఇద్దరకు నిద్రపట్టుటలేదు. గడియారము పదిఘంటలు కొట్టినది. మధురము మాధవునిగదిలో ప్రవేశించినది. మధుమాధవులు ఎవరికోర్కెలు వారు వెలిబుచ్చుకొనిరి. ఇద్దరు లేచినారు.

గృహమువిడిచి పయనమైనారు. ఎక్కడికి వెళ్లుచున్నారో వారికే తెలియదు. ఇంతలో కృష్ణానది కనుపించినది. ఒడ్డున యిసుకతిన్నెయందు మాధవునిఒడిలో మధురం. అశ్రుబిందులు ప్రవహించుచున్నవి. ఇద్దరు దుఃఖసముద్రములో మునిగిపోయారు. క్షణకాలములో ఇద్దరకు స్పృహవచ్చిలేచారు. చంద్ర కాంతులచేత తన ఆనందమును తెలియజేయుచూ పెద్ద తరంగములతో మహాతల్లియగు కృష్ణవేణి అతివేగముగా ప్రవహించుచున్నది. మధుమాధవులు తమ దుఃఖమును తెలియజేయుచూ అశ్రుతరంగములతో నదీ ప్రవాహములో లీనమైపోయారు.